
జనరల్ హాస్పిటల్ మార్చ్యుయరీ రూమ్‌లో అటాప్సీ జరుగుతోంది. పాథాలజీ ప్రొఫెసర్ శ్రీధర్ చకచక బాడీ డిసెక్ట్ చేసి, చేస్తూ తాను గమనిస్తున్న అంశాన్ని చుట్టూ గుమిగూడి వున్న విద్యార్థులకు మహోత్సాహంగా చెప్పుకుపోతున్నాడు. ఆనాటి అసిస్టెంట్ పాత్ర నిర్వహిస్తున్న ఓ విద్యార్థిని గబగబ నోట్స్ రాసేస్తోంది.

"చూడండి ఈ ఏంటీ బాయటిక్ ఎరాలో సిఫిలిస్ యింతగా జీర్ణించుకుపోయిన కేసులు అరుదు, అపూర్వం కూడా. ఈ కిడ్నీ మీద చూడండి, ఎలా పాచెస్ ఏర్పడ్డాయో మీ రందరూ ఫీలవ్వండి – కన్‌సిస్టెన్సీ ఎంత ఫరమ్‌గా వుందో ఐసే యిటీజ్ వుడ్ హార్ప్... ఇదిగో...



లివర్... బ్రెయిన్... యుటిరస్... యు ఫీల్ ది లింఫ్ గ్లాండ్ హియర్, టిపికల్ షాట్ ఎపిరియన్స్... వాట్ ఎ వండర్‌ఫుల్ టెరిషయరీ స్టేజ్ యిటీజ్...?"

మరో గంటకి ఫిటాప్సీ పూర్తయింది. తాను జాగ్రత్తగా బయటకు తీసిన శరీరభాగాలన్నీ బాక్సులో భద్రంచేసి, మ్యూజియంలో ఎరేంజ్ చేయమని అసిస్టెంట్లకి పురమాయించి, వాష్ బేసిన్ దగ్గర శుభ్రంగా చేతులు వాష్ చేసుకుని

# మరో మనిషి

బయటికి వచ్చాడు శ్రీధర్.

మార్చ్యుయరీ బయట, కాంపౌండ్‌లో ఆ చనిపోయిన స్త్రీ తాలూకు మనుషులు కాబోలు అయిదారుగురు చెట్లక్రింద కూర్చుని కనబడ్డారు. "ఆ శవం కోసం కాబోలు" అనుకున్నాడు శ్రీధర్, అదిప్పుడు కోనుకుపోయి స్మశానంలో భూపతనం చేస్తేనే గాని యీ అమాయక మానవులకూ, ఆ చనిపోయిన మనిషి తాలూకు ఆత్మకు శాంతి లభించదు కాబోలు. వింత మానవులు. అయినా ఆ దేహంలోని సారమంతా తానే లాగేశాడు. అవి తన మ్యూజియంలో భద్రపరచబడి వుంటాయి. ఎందుకూ పనికిరాని మిగతా దొల్లనే వాళ్లు కర్మాదులకు వినియోగించుకోవాలి.

అతను దేవుణ్ని నమ్మడు, మూధనమ్మకాలనేమీ దరికి చేరనివ్వడు. చాదస్తాలకూ, ఛాందస భావాలకూ సంబంధించిన ఏ కిరణలేశమూ అతనిపై ప్రసరించదు. ఎటాచ్‌మెంట్స్ అంటారే – అతను వాటికి అతీతుడు.

తమ గదికి వచ్చి, మరోసారి శుభ్రంగా చేతులు కడుక్కొని, భోజనం చేద్దామని క్యారియర్ విప్పబోతున్నాడు.

ఇంతలో బల్లమీద ఫోన్ మ్రోగింది. వెళ్లి రిసీవర్ అందుకున్నాడు. అవతలి కంఠం డాక్టర్ రమది. "డాక్టర్, కంగ్రాట్యులేషన్స్" అన్నదామె.

"ఏమీ"

"నేను శ్రీదేవిని ఎక్జామిన్ చేసాను. షి యీజ్ ప్రెగ్నెంట్... ప్రైమ్ కదా అందులో వీక్‌గా వున్నారామె. మంచి ఫుడ్ ఇస్తూ జాగ్రత్తగా వుండాలి. నా దగ్గరకు శ్రీదేవి వచ్చినట్లు మీకు తెలీదు కదూ! తను అనుమానిస్తున్నారట. వచ్చి పరీక్ష చెయ్యమన్నారు... థర్డ్ మన్త్."

అతని చెవులు పనిచేయడం మానేశాయి. క్షణంలో వెయ్యి భయాలు చుట్టుముట్టాయి. రిసీవర్ పట్టుకున్న చెయ్యి కంపిస్తోంది. "మైగాడ్!" అనుకున్నాడు అప్రతిభుడై.

* * *

కారు పోర్టికోలో ఆపి, ఎదురుగా వస్తున్న శ్రీదేవి వంక చూడకుండా మౌనంగా గదిలోకి వెళ్లి సోఫాలో కూలబడ్డాడు శ్రీధర్.

అతనలా చేస్తాడని ఆమె ముందే వూహించి వుంటుంది. ఒక నిమిషం మెదలకుండా వూరుకుని, తరువాత నెమ్మదిగా అతని వెనక్కి వచ్చి నిలబడింది. "ఈ వార్త మీలో కలవరపాటు కలిగించింది కదూ!"

అతను తల త్రిప్పి ఆమెవంక భావశూన్యంగా చూశాడు. అతని చూపులు ఎప్పుడూ అంతే. ఎప్పుడో కాని అవి భావస్ఫోరకంగా వుండవు.

'కూర్చో చెబుతాను!' అన్నాడు. మొదట భార్యను శాంతపర్చాలనే ఉద్దేశ్యంతో.

కొమ్మూరి వేణుగోపాలరావు

"ఫర్వాలేదు చెప్పండి" అంది నిలబడే.

"అలాకాదు కూర్చో"

శ్రీదేవి ఎదురుగా వున్న సోఫాలో ఆసీనురాలై ప్రశ్నార్థకంగా చూసింది.

"చూడు శ్రీదేవీ!" సానునయంగా ప్రారంభించాడు. ఆమె పెనిమిటి మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్, భౌతికవాది అయిన శ్రీధర్. "నేను చెప్పే విషయాలు విని కలతపడకు. మన వివాహం జరిగి అయిదేళ్లయింది. అందులో రెండు సంవత్సరాలు నా విదేశీ పర్యటనలో గడిచిపోయింది. వృత్తి రీత్యా తొందరగానూ, దాంపత్య రీత్యా ఆలస్యంగానూ ప్రకాశించసాగిన జీవితాలు మనవి. ఇంకో రెండేళ్లలో నేను మళ్లీ స్టేట్స్‌కి పోవాల్సి వుంది. ఈసారి నాతోను నీవు వుంటావు శ్రీదేవీ! నాకు యింతవరకు సంతానేచ్ఛ కలగలేదు. దానివల్ల అనిర్వచనీయమైన ఆనందం వూడిపడుతుందని గానీ, ఏదో సాధించగలుగుతామని గానీ భ్రమలేదు నాకు. ఈ తాపత్రయం నాకయిష్టం. ఈ బాదరబందీ యిప్పుడు పెద్ద అడ్డంకి. మనమేం వృద్ధులమై పోలేదు. ఒక ప్రశ్నడుగుతాను ఈ హేపీనెస్ నశించిపోవడం నీకంత అయిష్టమా!!"

శ్రీదేవి కష్టంమీద నిట్టూర్పు అణుచుకుంది. అతనిమాటలు విన్నాక ఆమె హృదయక్షేత్రంలో రెండు ప్రశ్నలు ఉదయించాయి. ఒకటి ఏది హేపీనెస్! రెండవది అతనిదంతా యిప్పుడు దేనికి చెబుతున్నాడు? అంటే యిప్పుడు వ్యవహారం చెయ్యి దాటిపోయాక.

'అంతా విన్నావుగా' అన్నట్లు చూసి 'ఏమంటావు చెప్పు' అన్నాడు చివరికి ప్రొఫెసర్.

ఆమె ఎలాగో నవ్వగలిగింది. 'అనేందుకు ఏముందిక?'

## మనిషిలో మరో మనిషి – మరమనిషి

తెలుగు సాహిత్యంలో తొలితరం నడుస్తుండగా – విరబూసిన సాహిత్య కుసుమం డాక్టర్ కొమ్మూరి వేణుగోపాలరావు. ఆర్ద్రత, ఆత్మీయత, గాఢమైన జీవితపు లోతులు, శరత్‌లా అనితరసాధ్యమైన శిల్పనైపుణ్యం, వృత్తిపరమైన కథాంశాల ద్వారా తనదైన ముద్రతో చేసిన రచనలు (హౌస్‌సర్జన్ వగైరాలు), ఇంకా అనేక సామాజికాంశాలు, సమస్యల్ని చిత్రికపట్టి, మేలిమి వజ్రాలుగా తన రచనల్ని పాఠకులకు అందించిన ప్రత్యేకత కొమ్మూరిది. 'పెంకుటిల్లు' ఫేమ్ ఆయన్ని అగ్రశ్రేణిలో కూచోబెట్టింది.

'మరమనిషి' కథ– బహుశ ఆయన మాత్రమే చేయగల రచన. ఎందుకంటే – ఇందులో రెండు అంశాలు ఉన్నాయి. ఒకటి వైద్యపరమైన కోణం. రెండవది మానవత్వ స్పర్శ. ఈ రెండిటినీ మిళితంచేస్తూ ఏదీ మోతాదు మించకుండా – అతి సునాయాసంగా కథనం చేస్తూ, మనసులోంచి అక్షరాల్ని ప్రవహింపచేస్తూ తెలుగు సాహిత్యంలో శాశ్వతంగా నిలిచిపోయే గొప్ప కథని మనకందించారు కొమ్మూరి. ఆయన కీర్తిశేషుడైనా, ఆ కీర్తిని ఘనంగా మారుస్తున్న కథానిక ఇది. వందేళ్ల తెలుగు కథానిక వేడుకల్లో కలికితురాయిగా, ప్రత్యేక కానుకగా 'కథాకేళి' పాఠకులకు దీనిని అందించడం జరిగింది.

– కాటూరు రవీంద్రత్రివిక్రమ్

"ఏమీ లేదా!" అన్నాడతను నిస్పృహగా.

"ఊహూ"

అతను చేతులు నలుపుకుని 'యింతలో యింత ఉపద్రవం ముంచుకొస్తుందనుకోలేదు' అని గొణుక్కున్నాడు.

అంత విపరీత పరిస్థితిలోనూ వచ్చిన నవ్వాపుకుని ఆమె మెల్లిగా లేచి అతని ప్రక్కకి వచ్చి కూర్చుంది.

కాస్త అనునయించాలని "చూడండి మీరు" అంటూ భుజంమీద చెయ్యివేసింది. ఆతనామె వైపు ముఖం త్రిప్పాడు! అదే భావశూన్యమైన చూపు, నిశ్చలమైన కంఠంతో అన్నాడు. ఈ మమతలూ, మమకారాలూ, తాపత్రయాలూ నా తత్వానికి సరిపడవు శ్రీదేవీ! నాకు కావలసిందల్లా ఘాటైన జీవితం. అది నా చెప్పుచేతల్లో ఉండి నేననుకున్న మలుపులే తిరగాలి.

ఆకస్మిక సంఘటనలూ, బలవంతపు బంధనాలు నాకప్రీతికరం. నేను నీకు తెలుసు. విరహాలూ, ఒకరంటే ఒకరు పడిచావటం, పటాలుమని ప్రేమ బహిరంగంగా బ్రద్దలుకావడం అణువులో అణువు అనీ, రక్తంలో రక్తమనీ మన తాలూకు మాంసకండమనీ బలహీనతలు పునాది వేసుకుని వ్రేళ్లని పాతుకుంటూ బలంగా పెరగడం, జీవిత వికాసానికది ప్రతిబంధకం కావడం నాకు సరిపడదు. ఈ భూమ్మీద అన్నిటి ంటే బలమైనది యీ బలహీనతే. ఇది యంత్ర యుగం. విజ్ఞానం విప్లవరూపం ధరిస్తున్న కాలం. మేధస్సు రబ్బరులా సాగాలిగాని తాడులా తెగిపోకూడదు శ్రీదేవీ!

ఎంత నిగ్రహించుకుందామన్నా ఆమె కన్నీటిని ఆపుకోలేకపోయింది. తరతరాల అక్షరాలా లిఖించగలిగే ఆ బరువైన నీటి బిందువులు, మృదువైన చెంపల మీద భారంగా జారి, మచ్చ లేని ఆమె కంఠసీమ మీద మచ్చలుగా ఏర్పడుతున్నాయి.

"ఏడ్చే వాళ్లంటే నాకు మహా చిత్రం!"

"మీరు కఠినులు" అందామె గాద్గదిక కంఠంతో కొంచెం కోపంగా.

"బహుశా నిజమే!" అంటూ లేచి నిలబడ్డాడు. ఇంటికి వచ్చేక అతను బట్టలైనా మార్చుకోలేదు. అలవాటు ప్రకారం కాఫీ అయినా తీసుకోలేదు. మెల్లిగా కదిలి కారిడార్‌లోకి వెళ్లి బయటకు చూస్తూ సిగరెట్టు వెలిగించాడు.

"ఈ కఠినత్వమే నాకు మేలు చేసిందేమో, అందుకే యీ వయస్సులోనే ప్రొఫెసర్‌ని కాగలిగానేమో! ప్రేమ అనే వ్యామోహాన్ని నేను కఠినంగా ఎదిరించలేకపోయివుంటే మామూలు గ్రాడ్యుయేటుగా మిగిలిపోయేవాణ్ని. నిజం నీకూ తెలుసు".

ఆమె ఏమీ సమాధానం చెప్పలేదు. ఆ నిశ్శబ్దవాహినిలో ఆమె సన్నని రోదన తరంగనాదంలా వినవచ్చింది.

చలికాలం. దక్షిణ దిక్కు నుండి వుండి వుండి శీతల వాయువులు వీస్తున్నాయి. భూమి, ఆకాశం ఎప్పుడో చల్లబడ్డాయి. నెమ్మది నెమ్మదిగా చీకటి ఛాయలు పృధ్వి మీద చోటుచేసుకుంటున్నాయి. ప్రొఫెసర్‌గారి బంగళా ముందున్న చిన్న తోటలోని గుల్షన్, లిల్లీ, చెంగల్వ, మాలతి, సన్నజాజి తీగెల పొదల మీద నుండి కమ్మని పరిమళాలు వీస్తున్నాయి. అతను నిలబడిన ప్రదేశానికి దాపునే వున్న యూకలిప్టస్, కర్పూర వృక్షాలు మృదు సుగంధాన్ని విరజిమ్ముతున్నాయి. హైద్రాబాద్ మారేడుపల్లిలో ఏకాంత ప్రదేశంలో అతను ముచ్చటపడి కట్టించుకున్న

బంగళా అది. ముద్దుల మూడగట్టే తోటా, అందులోని రకరకాల పుష్ప సముదాయములూ సెంటిమెంట్స్‌కు బానిస అయిన శ్రీదేవి కృషి. ప్రొఫెసర్ శ్రీధర్ శవాలతో, శవాల తాలూకు మాంసఖండాలతో, మైక్రోస్కోపులతో మాట్లాడినట్లుగా పువ్వులతో మొక్కలతో మాట్లాడతాడు. వాటి సౌందర్యం, సౌరభం అతని నేత్రాలనూ, ఘ్రాణేంద్రియాన్ని బొత్తిగా ఆకట్టుకోలేవు. ఇటుక, సిమ్మెంటులతో చేసి మొజాక్ ఫ్లోరింగ్‌తో నింపేసిన బంగళాను మాత్రం నీట్‌గా వుంచడంలో అతను దిట్ట.

కాసేపటికి సిగరెట్ అవతలకి విసిరేస్తూ వెనక్కి తిరక్కుండానే అతనన్నాడు. 'సాధన నా పరమ లక్ష్యం. ఆ శిఖరాగ్ర అవరోహణలో యిటువంటి చిన్న చిన్న అవరోధాలు టుమ్రీల లాంటివి. అవలీలగా దాటేయవచ్చు నేను చెప్పినట్లు నడుచుకుంటే. నెల తప్పింది నీకు. అంతేగా - నీ ఆరోగ్యము మంచిది కాదు. నువ్వు ఎంతవరకూ బర్త్ యివ్వగలవో నాకు అనుమానమే. ఒక పసికందు కోసం నీ ప్రాణాపాయం తెచ్చుకోవడం మియర్ ఫూలిష్‌నెస్. నేను చెప్పేది అర్థంచేసుకో. ప్రస్తుత పరిస్థితిలో యిది నాకు యిష్టం లేదు.. సమయం మించిపోలేదు... నేను డాక్టర్ని. దీన్నాపు చేయుటకు సాధ్యమవనంత సంగతేం కాదు -

ఒక్క నిమిషం... కాదు... ఒక్క క్షణం నిప్పులు చెలరేగే నిశ్శబ్ద భూకంపానికి ముందు మహాసముద్రం - అల్పపు ప్రపంచాన్ని కబళించేముందు, అగ్నిపర్వతం పతాలుమని బ్రద్ధలై లావాని గుమ్మరించేముందు ఒక్క క్షణం సంకోచించినట్లు... నిప్పుల్నిచెరిగే నిశ్శబ్దం తరువాత పెద్ద శబ్దం... అతనదిరిపడి వెనుతిరిగి చూశాడు.

శ్రీదేవి నేల మీద స్మృతిహీనురాలయి పడింది.

*   *   *

హెడ్ లైటు వెల్తురు గదంతా మందంగా ప్రసరిస్తోంది. గోడ మీద గడియారం టిక్కుటిక్కుమని చప్పుడు చేస్తోంది. పన్నెండు దాటిపోయింది.

శ్రీదేవి నిద్రపోవటంలేదు. కంఠం వరకూ దుప్పటి కప్పుకొని పడుకుని, కళ్లు మూసుకుని ఆలోచిస్తోంది. సాయంత్రట ఆ సంఘటన జరిగినప్పటి నుంచీ ఆమెకు భర్తని చూస్తూంటే, అతడ్ని తలుచుకుంటుంటే ఒళ్లు జలదరిస్తోంది. హృదయక్షేత్రంలో ఎక్కడపడితే అక్కడ అతను తన భర్తగా కాక ఓ ప్రొఫెసర్‌గా, మరమనిషిగా సాక్షాత్కరిస్తున్నాడు. ఆమెకి నిదురరాదు.

కన్నీటితో తలగడను అభిషేకం చేస్తోంది. అవి యీరాత్రి ఇంకిపోవు. కనులు సగం తెరచి అతని మంచం వైపు చూసింది.

ఓ ప్రక్కకి వొత్తిగిలివున్నాడు అలవాటు ప్రకారం. గాఢ నిద్రలో వున్నాడేమో!

ఈ వ్యక్తి ఎప్పుడూ యింతే. ఆ వ్యక్తిత్వం... అతని వ్యక్తిత్వం, పోనీ స్థాయి అందుకుందామన్నా అందుకో బుద్ధికాదు. క్రిందకి పడిపోతేనే హాయిగా వుంటుందేమో అనిపిస్తుంది.

అతనికిప్పుడు ముప్పయి అయిదు, ముప్పయి ఆరు సంవత్సరాలుంటాయి. సన్నగా, పొడుగ్గా వున్నా, ఉక్కులాంటి బలమైన శరీరం. అతని చురుకైన నేత్రాలలో ఎప్పుడూ శాంతి నశించదు. అతని నిర్మలమైన ముఖంలో ఎప్పుడూ అలసట ద్యోతకం కాదు. అతని జుట్టు కొంచెం కూడా రాలిపోలేదు. ఎక్కడా నెరసిపోలేదు. ఈ వయసున అతను ప్రొఫెసర్ అయ్యాడంటే - అది తేలిక సంగతేం కాదు.

చూపులు త్రిప్పుకుని శ్రీదేవి గట్టిగా కళ్లు మూసుకుంది. అతని తల్లి శారదమ్మ వివాహానికి పూర్వం తనతో యిలా అనేది. తనకు కావలసిన వస్తువును యెదుర్కోవటం వాడికి చేతకాదు. దాని విలువ గ్రహించటమూ తెలీదు. వాడు ఏకాకి అయిపోతాడేమోనని భయంగా వుంది. ఈ దీనురాలి కోరికను మన్నించి అలా కానివ్వ కూడదు నువ్వు. చూడమ్మా, ఆ బండరాయి అంటే నీ కసహ్యం లేదు కదూ.

తను అభయమిచ్చింది. వృద్ధురాలి కోరిక తీర్చింది.

పాపపుణ్యాల ప్రసక్తి వచ్చినపుడు శ్రీధర్ అనేవాడు, పుణ్యం, పాపం - వీటికి నేనాట్టే ప్రాధాన్యత యివ్వను. పుట్టుకా, చావు జీవితానికి మొదలు, క్లయిమాక్సు కావు. నాకు కావల్సింది మనుగడ. ఈ మనుగడ ఒక ఉక్కు పాత్ర అయితే ఎక్కడా నొక్కులూ, చిల్లులూ వుండకూడదు. నాకు ఊహ వచ్చిన దాదిగా నేను మెటీరియలిస్టుని. అయితే అంత మాత్రం చేత శూన్యాన్ని, దారుణాన్ని మాత్రం కాదు. నా పరిధిలో నాకూ కొన్ని యిష్టాయిష్టాలు, అభిరుచులూ వున్నాయి. కాని అవి మూఢ నమ్మకాలు కావు. అవి నా మనసున వికాసాన్ని పెంపొందింపజేసేవి.

"ఎలాంటివి?" అన్నదామె ఎగతాళిగా.

"ఎలాంటివా? నువ్వంటే నాకిష్టం. ఈ సత్యాన్ని నేను ధిక్కరించలేను. ఈ ఊహ నాకు బాగుంటుంది - అలాంటిది".

అతడు ఆమెకు కొంత అర్థమయ్యాడు. కొంత అర్థం కాలేదు. అర్థమయినంతవరకూ సానుభూతి పెరగలేదు. అర్థం కాని విషయాలలో జుగుప్సా కలగలేదు. అతనికి జీవితంలో భ్రమలు లేవు. ప్రేమ పాఠాలు వల్లించడు. ఊహాలోకాలు నిర్మించుకోడు. తను పొందదలచుకొన్న లాభానికి కృషిని ఫణంగా ధారపోస్తాడు. అతనికి బద్ధకం లేదు. తనకి కావలసిన వస్తువుల్ని అభిమానంగా చూస్తాడు. కాని అతను అతి మనిషి కాదు - 'మితి' మనిషి. ఏ సమయంలోనూ హాహాకారాలు చెయ్యడు. మనిషిని ఎత్తి కుదిపేసే ఉత్సాహం అతడినెన్నడూ ఆవహించదు. ఏడుపులూ, మొత్తుకోళ్లూ ఉప్పెనలాంటి ఉద్రేకాలూ అతని దృష్టిలో హాస్యాస్పదం. అతడు జీవితాన్ని తరచగలడు, తొలుచుకుంటూ పోగలడు. అనుకున్నవి సాధించగలడు. మాధుర్యాన్ని ఆస్వాదించగలడు. కాని వాటిని చిత్రాలుగా అతీతాలుగా పరిగణించడు.

అతని ముందు శ్రీదేవి ఎన్నడూ తనని తాను వెల్లి చేసుకోలేదు. బింకంగా వుండటం ఆమెకు తెలుసు. కాని ఇప్పుడు ఈ రాత్రి పడుకొని ఇంతగా దుఃఖిస్తున్నదంటే తన బాధని బహిర్గతం చేసుకొన్నదంటే యిది తిరిగి యిద్దరికీ వ్యక్తిగతమైన విషయం. ఇక్కడ ప్రకర్షలకూ, అభిజాత్యాలకూ తావులేదు.

కానీ శ్రీదేవి అనుకున్నట్లు శ్రీధర్ నిద్రపోవడం లేదు. అతనాలోచిస్తున్నాడు.

ఆలోచించి, ఆలోచించి చివరికిలా తేల్చుకున్నాడు. పోనీ ఆమె యిష్టప్రకారమే కానీయ్.

* * *

'ఐయామ్ సారీ డాక్టర్! దిస్ యీజ్ ఎ కేస్ ఆఫ్ హైడ్రోసెఫాలస్' అంది మిడ్ వైఫరీ ప్రొఫెసర్ రమాదేవి ఏడు నెలల తర్వాత - అన్ని యిన్వెస్టిగేషన్సూ అయాక.

శ్రీధర్ కొద్దిగా చలించాడు.

"వెల్ వీ మెట్రీ ఫైండింగ్స్ ఫేవరబుల్‌గా వున్నాయి. ఫీటస్ యింతవరకూ హెల్తీగా వుం

ది. రేర్ కేస్ అనుకోండి. ట్రయల్ లేబర్ యిచ్చి, కుదరకపోతే క్రేనియాటమీ చేసేస్తాను. ఏమం టారు?"

శ్రీధర్ తల ఆడించాడు. కాని ఒక్క క్షణం ఆలోచించి "ట్రయల్ లేబర్ రిస్క్ ఎందుకు డాక్టర్? క్రేనియాటమీతో ప్రొసీడ్ అయితే..." అన్నాడు.

"ఎందుకో డెలివరీ పాజిబుల్ అనిపిస్తోంది. శ్రీదేవి కేమీ అపాయం కలగదు. మీరు నిశ్చిం తగా వుండండి" అంది ధైర్యంగా రమాదేవి.

క్రేనియాటమీ చేసి ఎలాగైనా ఫీటస్‌ని డిస్ట్రా య్ చెయ్యమని గట్టిగా చెబుదామనుకున్నాడు. కాని ఆమె వినిపించుకోదు. గుడ్ బై చెప్పి బయటకు వచ్చేశాడు.

* * *

సిగరెట్ మీద సిగరెట్ కాలుతోంది. నిము షాలు నిర్దయగా తగలబడుతున్నాయి.

నిముషాలు యింత యాతనగా జరగటం అతని జీవితంలో బహుశా యిదే మొదటిసారి. శ్రీదేవి విలువ ఎంత అమూల్యమో, మనిషి ఎం దుకు యంత్రం కాదో ఇప్పుడు తెలుస్తోంది.

'బాప్‌రే! హాయిగా దుఃఖపడడం చేతకాని వాడు ఎంత దుఃఖించాడు!!'

ఫోన్ గణగణ మ్రోగింది. ఒక్క ఉదుటున రిసీవర్ అందుకున్నాడు.

'నార్మల్ డెలివరీ, మేల్ చైల్డ్. ఇద్దరి కండి షన్ బాగున్నది" అంది రమాదేవి నిశ్చలంగా. ఆమె అతన్ని అభినందించలేదు. ఆమె గొంతు లో ఆనందం ధ్వనించలేదు. కారణం అతనికి తెలుసు.

"థ్యాంక్యూ డాక్టర్!" అని నెమ్మదిగా అని ఫోన్ పెట్టేశాడు.

పిల్లాడి రంగు ఎరుపు. చేతులూ, కాళ్లూ సన్నంగా పుడకల్లా ఉంటాయి. దేహం గాలి లేని తిత్తిలా వేళ్లాడుతోంది. తల తాటికాయంత వుంటుంది. ఆ తలకు తగ్గట్లు మిడి గుడ్లూ తీరూ తెన్నూ లేని ముక్కూ నోరు... ఆ పిల్లాడా యింట్లో పెరుగుతున్నాడు.

వాడ్ని ఎప్పుడు చూసినా తమ పాథాలజీ మ్యూజియంలో అలాంటి స్పెసిమన్ లేదన్న సంగతి గుర్తు వస్తుంది ప్రొఫెసర్ శ్రీధర్‌కి.

ఆ పిల్లాడు పెరగడమే ఒక ఆశ్చర్యం శ్రీధర్ కి. సాధారణంగా కడుపులో వున్నప్పుడే చచ్చిపో తూ ఉంటారు యిలాంటి పిల్లలు. అందాన్ని బయటకు తియ్యడానికి దాని శిరస్సును పరిక రాలతో ఛిన్నాభిన్నం చేయవలసి వుంటుంది. జన్మించిన సమయానికి వీడి తల అంత మరీ పెద్దది కాకపోవడం వల్ల వాడి పుట్టుక సాధ్య మైంది. పుట్టాడు. పెరుగుతున్నాడు – నవ్వుతు న్నాడు.

శ్రీధర్‌కి తెలుసు – వీళ్లు బ్రతకగలిగితే వెర్రి తలకాయలుగా తయారౌతారని.

అతనాబిడ్డను ఒకటి రెండు సార్లు లేబరేటరీ లో వస్తువుని పరీక్షించినట్లు పరీక్షించాడు. ఎప్పుడూ ఎత్తుకుని ముద్దాడలేదు. కబుర్లు చెప్ప లేదు. శ్రీదేవితో వాడి యదార్థ స్థితిని గురించి, సంభవ సంభవాల గురించీ ఎప్పుడూ ప్రస్తావిం చలేదు.

శ్రీదేవి వాడికి కరుణ అని పేరు పెట్టుకుంది.

ఆ పిల్లవాడిని గురించి పూర్తిగా కాకపోయి నా కొంతయినా ఆమెకు తెలుసు. డాక్టర్ రమ చెప్పింది. అది ఓ రకం కన్‌జెనిటల్ ఎనాటమీ. బ్రెయిన్‌లో ఫ్లూయిడ్ పేరుకుని ఆ స్థితి దాపు రిస్తుంది.

శ్రీదేవికి భగవంతుడంటే నమ్మకముంది. పాపపుణ్యాల పట్ల, కర్మ సిద్ధాంతం పట్ల విశ్వాస ముంది. అందుకనే నా పాప ఫలమని గుండెల్లో అగ్నిహోత్రాన్ని దాచి వుంచింది.

ఆమె వాడ్ని క్షణం దింపదు. ఎంత ముద్దు చేస్తుందో లెక్క లేదు. ఎన్ని కబుర్లు చెబుతుంద ని, ఆ బుల్లాడికి... పోనీ ఎవరికి మాత్రం ఎలా తెలుస్తుందీ - ఎన్ని కన్నీటి కణాల సముదాయ మో! తనని తాకే ఆ పెదిమలిచ్చే ముద్దు.

భర్తతో కొడుకుని గురించి ఎప్పుడూ సంప్ర దించదు. ఎత్తుకోమని అడగదు. అసలు అతను చూస్తుండగా కొడుకుని ముద్దు చెయ్యదు. అత ను తమ యిద్దర్ని ఆ స్థితిలో చూడడం ఆమెకి బాగుండదు. భర్తతో ఆమె జీవితం మునుపటి కన్నా లోతుగాను లేదు. ఇప్పుడు తక్కువయిందీ లేదు.

ఆమె కరుణ కోసం బోలెడు బొమ్మలు కొన్న ది. తనే చిన్నపిల్లగామారి వాటిని ముందు పెట్టు కుని ఆడుతూ కూర్చునేది.

ఇంటికెవరైనా అతిథులు వస్తే కనబడనిచ్చే ది కాదు. వాడినెత్తుకుని లోపలకు పారిపోయేది. దాచిపెట్టేసేది. ఎవరన్నా చూస్తారని అభిమానం కాదు. కానీ సానుభూతి వాక్యాలు పలికినా, వ్యాఖ్యానించినా తనకు భగ్గుమంటుందని...

ఒకసారి కరుణకు కాస్త వళ్లు వెచ్చబడి మూలగటం ప్రారంభించాడు. శ్రీదేవి కంగారు పడి భర్త దగ్గరకు గబగబా వెళ్లింది. తప్పనిసరి గా కొన్ని సంఘటనలు జరిగి తీరాలిగా.

'బాబుకు జ్వరం వచ్చింది. ఒకసారి వచ్చి చూస్తారా? అంది కంపిత స్వరంతో. "పద" అని అతను లేచాడు. వాడి ప్రక్కలో కూర్చుని ఎగ్జామిన్ చేశాక 'కంగారుపడకు శ్రీదేవీ - మైల్డ్ బ్రోంకైటిస్. మెడిసిన్ తెప్పిస్తాను!' అన్నాడు.

ఆ రోజంతా అతను కొడుకును ఓ డాక్టరు పేషెంటుని చూసినట్లుగా చూశాడు.

రాత్రి ఏదో అలికిడి అయితే అతను తల త్రిప్పి చూశాడు. బెడ్‌లైట్ వెల్తుర్లో శ్రీదేవి పిల్ల వాడికి పాల సీసాతో ఫీడ్ చేస్తూ కనిపించింది. అప్రయత్నంగా గడియారం వంక చూశాడు. పన్నెండు దాటింది.

"శ్రీదేవీ! నువ్వు చేస్తున్నది కూడని పని. రాత్రి పది దాటాకా తిరిగి ఆరు గంటలదాకా ఫీడ్ చెయ్యకూడదు. మానెయ్యి" అన్నాడు.

శ్రీదేవి చేస్తున్న పనిని ఆపి, పిల్లాడ్ని ప్రక్కగ పడుకోబెట్టుకుని జోకొట్టి నిద్రపుచ్చడానికి ప్రయ త్నించసాగింది. వాడు ఊరుకోవడం లేదు. గుక్క పట్టి ఏడుస్తున్నాడు. ఇహ ఆమెకు వాణ్ని మరిపించడం సాధ్యం కాక "ఊరుకోడండి. పాలు పడతాను" అన్నది దీన స్వరంతో.

"రోజూ యిలాగే చేస్తున్నావా!"

"ఏడుస్తుంటే పడుతున్నాను".

"చదువుకున్నదానివి అయివుండి కూడా నువ్విలా ఎందుకు పనికిరాకుండా తయారవు తున్నావేం శ్రీదేవి".

ఆమె ఏమీ సమాధానం చెప్పలేదు. కాసేప టికి వాడింకా ఏడుపు తగ్గించకపోతే నిద్రాభంగ మవుతుందని ఎత్తుకుని కారిడార్‌లోకి తీసికెళ్లి అటూ ఇటూ తిప్పసాగింది.

రెండు రోజులకు వాడి జ్వరం తగ్గిపోయిం ది.

ఒకనాడు ఆమె లోపలి నుండి హాల్లోకి వచ్చేసరికి నిద్రపోతున్న పిల్లాడి వంక పరీక్షగా చూస్తూ కనిపించాడు శ్రీధర్. అతనంత దీర్ఘంగా ఏమి పరిశీలిస్తున్నాడో ఆమెకి బోధపడలేదు. తన సబ్జెక్ట్ తాలూకు ఒక స్పెసిమన్‌ని గ్రాస్

ఎపియరెన్స్ పరిశీలిస్తున్నట్లు పరిశీలిస్తున్నాడేమో! ఆమె వంటి మీద జెర్రులు ప్రాకినట్లయింది. వెనుక నుంచి చప్పుడు కాకుండా వచ్చి "చలిగా వుంది" అంటూ సాధ్యమైనంత పూర్తిగా దుప్పటి కప్పేసింది.

అతని కోసమని అప్పుడప్పుడూ స్నేహితులు వస్తూ వుండేవారు. వాట్ యీజ్ దిస్ శ్రీధర్! మీ కొడుకుని చూపించరేం? అని అడిగేవారు అందరూ.

"వాడు హెల్తీ ఛైల్డ్ కాదండీ, హైడ్రోసెఫలస్ అని ఓ డిసీజ్ వుంది. చాలా రేర్. యాదృచ్ఛికంగా మీరు యిద్దర్నీ చూసి వుంటారు. పెద్ద తలకాయ, ఇంతింత గుడ్లూ, డిస్ ప్రొపోర్షనేట్‌గా కాళ్లూ చేతులూ..." అని ఓ లెక్చర్ యిచ్చినంత పని చేసి "రండి చూద్దురుగాని" అంటూ లేచాడొకసారి.

"ఎందుకులెండి?" అని ఆ స్నేహితుడే ఇబ్బందిలో పడిపోయాడు.

"నో నో! ఏమీ ఫర్వాలేదు రండి" అంటూ శ్రీధర్ అతన్ని లోపలికి తీసుకుపోతున్నాడు.

శ్రీదేవి ఇదంతా ఆలకించింది. వళ్లంతా త్రేళ్లు పాకినట్లయింది. గుండెల్లో గునపాలు గుచ్చినట్లయింది. ఏది సభ్యత కాదు? పిల్లాడ్ని ఎత్తుకుని గబగబా గదిలో దూరి తలుపు గడియ పెట్టింది.

"శ్రీదేవీ! తలుపు తియ్యి. స్నేహితులు వచ్చారు. అబ్బాయిని చూస్తారట" అన్నాడు శ్రీధర్ తలుపు కొడుతూ.

లోపలినుంచి ప్రత్యుత్తరం లేదు.

"పోనీలెండి. మరెప్పుడన్నా చూడవచ్చు" అని మొహమాటపడుతున్నాడు మిత్రుడు.

గదిలో బిడ్డని పొత్తిళ్లలో పెట్టుకుని శోకమూర్తిలా కూర్చున్న శ్రీదేవికి యీ మాటలు దూరంగా వినిపించాయి. 'షి యీజ్ ఏన్ ఎడ్యుకేటెడ్ లేడీ. బట్ ఎ సెంటిమెంటల్ ఫూల్'.

పిల్లాడు యింకా కొంచెం ఎదిగాడు. బోర్లా పడుతున్నాడు. అంత పెద్ద తల వేసుకొని వాడు బోర్లా పడుతుంటే శ్రీధర్ ఎడ్యుకేషనల్ ఫిల్మ్ చూస్తున్నట్లు నిలబడేవాడు.

ఓసారి పిల్లాడు ప్రక్కమీద నుంచి దొర్లి పడిపోయాడు. తలకి దెబ్బ తగిలి నెత్తురు కూడా కారింది. ఆ రోజంతా శ్రీదేవి పడిన బాధ వర్ణనాతీతం. చూసి చూసి చివరకు శ్రీధర్ అన్నాడు మందలింపుగా. నీకు మళ్లీ మళ్లీ చెప్పవలసి వస్తున్నందుకు చింతిస్తున్నాను శ్రీదేవీ. అంతగా బంధాన్ని పెంచుకోవడం నీకే నష్టం.

తల్లికీ తనయుడికీ మధ్య వుండే సంబంధ బాంధవ్యాలను లాభనష్టాలతో త్రాసులో వేసి తూచడం చేతకాదు శ్రీదేవికి. కానీ ఆమె భర్తతో వాదించదు. మౌనంగా ఊరుకుంది.

ఒక రోజు అతను పని వున్నట్లు భార్యను పిలిచి చూడు శ్రీదేవి, వీడి తల రోజురోజుకూ పెద్దది అవడం లేదూ? అన్నాడు పడుకుని ఆడుకుంటున్న కొడుకును చూపిస్తూ.

శ్రీదేవి తల ఎత్తి అతని ముఖంలోకి చూసింది. ఆమె కళ్లలోనికి ఎర్రని జీర వచ్చింది. "చూడండి మిమ్మల్నో విషయం అడుగుదామనుకుంటున్నానెప్పటినుంచో".

గొంతులో అంత కాఠిన్యం అతనెప్పుడూ వినలేదు. అప్రతిభుడై చూశాడు.

ఈ పిల్లాడికి తండ్రినని మీకెప్పటికి స్ఫురిస్తుంది?

ఆమె జవాబు కోసం నిరీక్షించలేదు. జవాబు అక్కర్లేదు. పిల్లాణ్ని ఎత్తుకుని లోపలకు వెళ్లి

పోయింది.

అనుభూతులు ఎరుగని శ్రీధర్ అచేతనుడై నిలబడిపోయాడు.

* * *

చివరకు అనుకున్నంతా జరిగింది. శ్రీదేవిని విధి మళ్లీ వెక్కిరించింది. ఇన్నాళ్లకు, క్రమంగా పిల్లాడు క్షీణించిపోసాగాడు. చూపు నిలపడం తగ్గింది. వెర్రి నవ్వు ఆగింది. ఏవేవో కాంప్లికేషన్లు - పొట్టలో, గొంతులో, మెదడులో... ఒక దుష్టక్షణాన ఫిట్స్‌లా తల విసిరేయసాగాడు. అలా మూడు రోజులు తీసుకొని, తీసుకొని, మరో దుష్టక్షణాన తన వికృత రూపానికి స్వస్తి చెప్పి మరో రూపాన్ని వెదుక్కుంటూ వెళ్లిపోయాడు.

వాడి మృతదేహాన్ని వొళ్లో పెట్టుకుని శ్రీదేవి మౌనంగా కన్నీరుకారుస్తూ కూర్చుంది.. బయటకు ఒకమాటా అనలేదు. ఎవర్నీ నిందించలేదు.

చాలాసేపటికి అతడామెను సమీపించి 'ఎంతసేపలా దుఃఖిస్తూ కూర్చుంటావు శ్రీదేవి... వాణ్ని తీసుకుపోయి అంత్యక్రియలు జరిపిస్తాను?' అన్నాడు. ఆమె ఓసారి తలెత్తి అతని ముఖంలోకి చూసి, చేతులు జాచి శవాన్ని అందిచ్చి 'తీసుకువెళ్లండి' అంది.

కుమారుడి మృతదేహాన్ని శ్రీధర్ రెండు చేతుల్లో పొదివి పట్టుకున్నాడు. కారు దగ్గరకు తీసుకువెళ్లి బ్యాకుసీటులో పడుకోపెట్టి, స్టీరింగ్ ముందుకు వచ్చి కూర్చున్నాడు. కారు కదిలి ఆ బంగళా దాటిపోయింది.

మూడు రోజులు శ్రీదేవి యీ లోకంలో లేదు. ఏమీ తినదు. నిద్రపోదు. ఎవరితో మాట్లాడదు. ఎందుకో, ఎక్కడో అనవసరంగా అన్యాయం జరిగినట్లు లోపలినుంచి తొలిచే వ్యధ. ఆమె క్షీణించిపోతోంది.

తన తత్వానికి విరుద్ధంగా శ్రీధర్ ఆమె ప్రక్కనే గంటల తరబడి కూర్చుని ఓదార్చాడు. ఆమె మనస్సుకు ఉల్లాసం కలుగచేయాలని ఉన్ముఖత పర్చారని ఆరాటపడ్డాడు. చివరికన్నాడు - దుఃఖాన్ని మనం పరమ శత్రువులా చూడాలి. ఆ సత్యం తెలుసుకో.

ఇంట్లో ఏ మూలకి పోయినా, ఏ గదిలో అడుగుపెట్టినా... ఆమెకా రూపమే ప్రత్యక్షమవుతుంది. పెద్ద తలకాయ, చిన్నచేతులూ, కాళ్లూ, గట్టిగా పలకలేని నోరూ...

ఆ నోరు జాలిగా "అమ్మా! అమ్మా!" అని పిలుస్తున్నట్లు వినిపిస్తుంది. ఆమె గుండెల్లో తుపాకి గుళ్లు దిగబడతాయి.

నేను నోచుకోలేదు, నేను నోచుకోలేదు... అని వాపోతోంది.

ఆ మంచి నోరు ఇలా అంటుంది... అమ్మా! ఇది నా తప్పా? మరి ఎందుకే యీ శిక్ష?"

'బాబూ యీ శిక్ష నీకు కాదు, నాకు. అసలిది శిక్ష కానేకాదు - నా పంట - నా అదృష్టం'.

నోరు అంటుంది. "పోవే అమ్మా! నేను వెళ్లిపోవటమే మంచిది. బ్రతికి అందరి వికృతపు చూపులూ నామీద పడడంకన్నా!"

"వాళ్లని కాల్చేస్తాను. వాళ్లని శపిస్తాను. వాళ్ల అంతు చూస్తాను".

నోరు అంటుంది "కాదులే అమ్మా! నా కోసం నువ్వు యిరుకు జీవితం అనుభవించడమెందుకు?"

"అయ్యో! నేనెంత కిరాతకురాల్ని? నేనే అలా పుట్టివుంటే నా జీవితం ఏమయి వుండే

ది?"

ఆమె ఆలోచనలతో, సంఘర్షణలతో దహించే విషాదంతో అలసి సొమ్మసిల్లిపోయేది.

'మైగాడ్! పూర్వులు చెప్పింది నిజమే. నరకమున్నది' అని సిగరెట్లు తగలబెట్టేవాడు శ్రీధర్.

పాథాలజీ మ్యూజియంలో మిగతా స్పెసిమన్ అన్నీ ఒక ఎత్తు, శ్రీధర్ కొత్తగా అమర్చిన స్పెసిమన్ ఒక ఎత్తు. హైడ్రో సెఫలస్ సర్వసాధారణంగా యినో ట్రూయిస్ టరైన్. లైఫ్‌తోనే ఫీటస్ చచ్చిపోతుంది. దిస్ యీజ్ ఎ రేర్ కండిషన్. అయిదు నెలల వరకూ జీవించాడు అని ప్రొఫెసర్ శ్రీధర్ విద్యార్థులకు చూపించాడు.

అతనికి సెంటిమెంట్లు లేవు. మూఢనమ్మకాలు అంతకంటే లేవు, అయినా ఆ స్పెసిమన్ అంటే అత్యంతాభిమానం. అసలు రోజూ ఓ గంట మ్యూజియంలో గడపడం అతని అభ్యాసం. అందులో తిరుగాడుతూ సరిగ్గా దాని దగ్గరికి వచ్చేసరికి అప్రయత్నంగా ఆగిపోయేవాడు. అయిదు నిమిషాలు అలాగే నిలబడిపోయేవాడు. అతని కళ్లు తదేకంగా దానిని వీక్షిస్తూ ఉండేవి. ఫార్మలిన్‌లో తేలుతున్న ఆ పెద్ద తలకాయ గల చిన్న శరీరం అతని హృదయంలో రోజు రోజుకూ స్థావరం ఏర్పరచుకోసాగింది.

దానిచెంత నిల్చుంటే అతని హృదయం స్పందించినట్లు ఉండేది. శరీరం చమర్చేది. అక్కడ ప్రదర్శనకు వుంచబడిన పదార్థం సైన్సుని విరజిమ్మే ఆ ఉపయుక్త వస్తువు తన రక్తంలో రక్తం, తన బొమికలో బొమిక, తనలో ఓ అంశ. ఈ రకం అర్థభావాలు తననావహిస్తున్నాయని అతనికి మొదట్లో తెలిసేది కాదు. అంతా యాంత్రికంగా జరిగిపోతుందనుకునేవాడు. కాని యీ హృదయస్పందన, చురుక్ చురుక్‌మనే ఆవేశం... తను ఏదో అజ్ఞాతశక్తికి లోబడి పోతున్నానని, తనని ఎవరో జయిస్తున్నారనీ అతను గ్రహించేడు. సిగ్గుపడ్డాడు. ఇహనుంచి ఆ ప్రదేశంలో ఆగకూడదనుకున్నాడు. అక్కడ్నుంచి గబగబా ముందుకు నడచి వెళ్లిపోవడానికి ప్రయత్నించేవాడు. కాని అతని పాదాలు అతను చెప్పినట్లు వినడం మానేశాయి. అక్కడకు చేరుకునేసరికి చటుక్కున ఆగేవి. వెంటనే కళ్లు అటు తిరగడం, తదేకంగా తిలకించడం... అథవా మానవ ప్రయత్నం జయించి ఎప్పుడైనా ముందుకు సాగిపోయినా ఏదో ఒక నెపంతో తిరిగి అటు నెట్టుకుంటూ వెళ్లేవి పాదాలు. అతనీ బాధ భరించలేక అసలు మ్యూజియం హాలులోకి అడుగుపెట్టకూడదని నిశ్చయించి, అందుకు ప్రయత్నించాడు. కాని కనీసం ఒక్కరోజు, ఒక్కరోజు కూడా అతనా ప్రయత్నంలో సఫలీకృతుడు కాలేకపోయాడు. అక్కడికి వెళ్లకూడదనుకున్నకొద్దీ మనసటే పరుగెత్తేది. గుండెను ఆ మ్యూజియం హాలు కళ్లెంవేసి లాగుతున్నట్లు అయ్యేది. ఈ నిగ్రహం... ఆ ఆకర్షణతో చివరిన తన్ని బలహీనత కమ్మేసేది. కళ్లు మూసుకుని అలసటగా 'బాప్‌రే' అనుకునేవాడు. అతనికి తెలియకుండానే ఎప్పుడో అతని కళ్లూ, కాళ్లూ వాటి పని అవి చేసేవి.

ఇలాంటి అవస్థ జీవితంలో మునుపెన్నడూ లేదు. అతన్లో యుద్ధం మొదలయింది. అంతర్యుద్ధం. తనలో తను పోరాడుతున్నాడు. తనమీద తను పళ్లు కొరుకుతున్నాడు. కత్తులతో ఝుళిపిస్తున్నాడు.

మొదట విజ్ఞాధాభిరుచి, తదుపరి యుద్ధం, తదనంతరం అభిమానం, ఆ తర్వాత ఆకర్షణ, అటుపైన మమకారం, వెర్రి భ్రమ, పిదప ఏకత్వం – ఒకదాని వెనుక ఒకటి విరుచుకుపడ్తూ అతన్ని కుదిపి కదిపి పారేస్తున్నాయి. ఆకృతి ఒకసారి నిద్రలో కూడా ప్రత్యక్షమవుతుంది.

అస్పష్టంగా కలవరిస్తున్నాడు.

శ్రీదేవి తన పరిధి నుంచి యివతలకు వచ్చి అతన్లో వచ్చిన మార్పుని గ్రహించేసరికి రోజులూ, వారాలూ గడిచిపోయాయి.

ఒకరోజు అతను ప్రక్కమీద పడుకుని పైకి చూస్తున్నాడు. ప్రక్కన అలికిడి అయ్యింది. అతనికి తెలియలేదు. శ్రీదేవి వచ్చి అతని ప్రక్కన కూర్చుని, అతన్ని స్పర్శించేదాకా అసలు గ్రహించలేదు.

ఉలికిపడి ఆమెవంక చూసేసరికి 'చెప్పండి' అంది మృదుకంఠంతో.

"ఏమిటి?"

"మీలో ఏదో మార్పువచ్చింది. దేనికో బాధ పడుతున్నారు. మనిషి చిక్కిపోయారు. ముఖంలోని కాంతి కూడా నశించింది. పరధ్యానంగా వుంటున్నారు. కలవరిస్తున్నారు. ఇదంతా దేనికని?" తన చేయి అతని వక్షస్థలంపై వుంచి ఎంతో ఆదరపూర్వకంగా అడిగింది.

అతను విస్మితుడయ్యాడు. నిజంగానా? నిజంగా నాలో అంత మార్పు వచ్చిందా?

"ప్రపంచ చరిత్రలోని విశిష్టమైన సంగతి. నిజంగా మీలో అంత మార్పు వచ్చింది. నా కళ్లని నేను నమ్మలేకుండా వున్నాను!"

"కారణం నాకూ స్పష్టంగా తెలీదు శ్రీదేవీ".

"పోనీ నాకు కారణం చెప్పవద్దుగానీ, మీరు మాత్రం మామూలుగా వుండండి. నా విశ్వాసాలను చెదరగొట్టే బలహీనతలు రెచ్చగొట్టకండి".

అతనామె కళ్లలోకి చూస్తూ చాలాసేపు ఊరుకున్నాడు. శ్రీదేవీ! నిన్నో ప్రశ్న అడిగేదా? అన్నాడు తర్వాత.

"అడగండి"

"నేను చాలా ఎబ్బెట్టు మనిషినా?"

ఆమె అదిరిపడి అతని ముఖంలోకి చూసింది. అతని ఛాతీమీద మృదువుగా రాస్తున్న చెయ్యి ఆగిపోయింది.

"నువ్వు నన్ను ద్వేషించిన సమయాలూ, ఏవగించుకున్న సన్నివేశాలూ చాలా వున్నాయా!"

ఆమె చటుక్కున లేచి వచ్చింది. ప్రభూ ఇది ప్రశ్న కాదు. ధనుర్విముక్త... కానీ తమాయించుకు ప్రాధేయపూర్వకంగా అంది... 'మీరెప్పుడూ నన్నిలా అడగరనుకున్నాను. ఇలాంటి సమయం రాదనుకున్నాను. మీ ప్రవర్తననూ, శిక్షణనూ అనుభవించానుగానీ యీ ప్రశ్నను మాత్రం సహించలేను. ఇప్పుడే కాదు... నేను చచ్చిపో యేలోగా ఎప్పుడూ నన్నీ ప్రశ్న వేయవద్దు, క్షమించండి మనస్సు గాయపరిస్తే' అని లేచి అక్కడ్నుంచి వెళ్లిపోయింది.

అతను నిట్టూర్చాడు. శ్రీదేవికి తను చేసిన పని తెలీదు, తెలిస్తే ఏం జరుగుతుంది? అగ్ని పర్వతం బద్దలవుతుందా?

ఒక మహా విలయం సంభవిస్తున్నది. భూమి బీటలు వారుతోంది. బ్రద్ధలవుతున్నది. అగ్నిపర్వతాలు మంటలు ఎగచిమ్ముతున్నాయి. లావాని విరజిమ్మేస్తున్నాయి. సముద్రాలు పొంగి ప్రపంచాన్ని కబళించివేస్తున్నాయి. తుఫానులు చెలరేగుతున్నాయి. జ్వాలలు మాడ్చి మసిచేసే వేడి, ప్రపంచపు పొలిమేరకు గిరవాటు వేసే సుడిగాలి, ప్రవాహాలను సృష్టించే కుంభవృష్టి, అథఃపాతాళానికి త్రోసేసే భూకంపం.

కెవ్వుమని కేక పెట్టాడు.

కిటికీలోంచి గగనవీధుల్లోకి తిలకిస్తున్న శ్రీదేవి పరిగెత్తుకొచ్చింది. ఏమండీ... ఏమయింది? అడుగుతోంది ఆతృతగా, ముఖం మీదకి

వంగి.

అతనికి శరీరమంతా ముచ్చెమటలు పోసేశాయి. గజగజమని వణుకుతున్నాడు. శ్రీదేవి కంఠం మరో లోకం నుండి వినిపించినట్లయింది. బలవంతంగా కళ్లు తెరిచాడు.

"ఏమండీ ఎలావుంది?" అతని ముఖం మీద శ్రీదేవి ముఖం.

"ఏదో కల వచ్చింది శ్రీదేవీ. సర్వనాశనం జరిగిందిట" అన్నాడు బలహీనంగా.

ఆమె వదనమండలం నీలిమేఘాలతో నిండిపోయింది. 'మీరు ఎక్కువగా ఆలోచిస్తున్నారు. అందుకే...'

కాసిని క్షణాలు మౌనంగా గడిచిపోయాయి.

"వారం రోజులయింది కదూ నేను మంచమెక్కి"

తల ఊపింది.

"అబ్బా! యింతకాలం నేనెప్పుడూ జబ్బుపడలేదు. అందుకేనేమో...

ఊఁ

అందుకేనేమో ఆలోచనలు...

"మీరలా విసుగుచెందకూడదు. ఇంకో రెండు రోజులు పూర్తి విశ్రాంతి తీసుకుంటేనే గాని మీరు మామూలు మనిషి కాలేరు.

'మామూలు మనిషి' అతని పెదాలపై చిరునవ్వు ఆవయించింది.

"ఎందుకు నవ్వుతున్నారు?"

"అనుమానం వచ్చిందిలే".

"దేన్ని గురించి?"

అతనికేం చెప్పాలో తోచక "మళ్లా మామూలు మనిషిని అవుతానా?"

ఆమె కాళ్ల క్రింద భూమి కదిలినట్లయింది. 'అలా అనకండి' అంది డగ్గుత్తికతో.

"శ్రీదేవీ" అని పిలిచాడు.

'ఆ'

అటు బయటకు చూడు...

ఆమెకి అర్థంకాక "ఏముందండీ అక్కడ?" అని ప్రశ్నించింది.

"కావలసినంత ఉంది. అస్తమించే సూర్యబింబాన్ని కప్పేసిన మేఘాలు, నన్ను చూసి నవ్వే గాలి, వెక్కిరించే వృక్షసమూహాలు...

శ్రీదేవికి గుండె బరువెక్కింది. దుఃఖం ఉప్పెనలా ముంచుకు వచ్చింది. "అబ్బా అలా మాట్లాడకండి బాబూ. మీకు పుణ్యముంటుంది" ఆమె గొంతు పూడిపోయింది.

మళ్లా నిశ్శబ్దం.

శ్రీదేవి కాస్త సంకోచిస్తూనే 'ఇవాళ శనివారం కదూ. ఈ సాయంత్రం నేను దేవాలయానికి వెళ్దామనుకున్నాను. వెళ్లి రమ్మంటారా?' అని అడిగింది తలవంచుకుని.

"వెళ్లిరా. సంకోచించడం దేనికి?".

"మీరు ఇంట్లో ఒంటరిగా ఉండాలని..."

"పర్వాలేదు శ్రీదేవి. తగ్గిపోయిందిగా".

"సరే... కానీ మీరింకా నీరసంగానే వున్నారు. మంచంమీద నుంచి లేవద్దు సుమా! నేను గంటలో వచ్చేస్తాను" అని శ్రీదేవి మరీ మరీ చెప్పి వెళ్లింది.

నిముషం వెనుక నిముషం గడిచింది. శ్రీధర్‌కి యింక మంచం మీద పడుకోబుద్ధి కాలేదు. నెమ్మదిగా లేచి కూర్చున్నాడు. ఫర్వాలే

దు తేలిగ్గానే వుందనిపించింది. నిలబడ్డాడు. బాగానే వున్నట్లు తోచింది. మెల్లిగా కారిడార్ లోకి వచ్చి గోడకి ఆనుకున్నాడు.

ఆకాశాన చిక్కగా మేఘాలు అలుముకుం టున్నాయి. పశ్చిమాద్రిన సూర్యబింబం పూర్తిగా మూసుకుపోతోంది. వర్షం వచ్చే సూచనలు కనబడుతున్నాయి.

శ్రీదేవి కాలినడకన వెళ్లింది. తిరిగి వచ్చేస రికి తడిసిపోతుందేమో? అతని మనసు ఆరాట పడ్డది.

అక్కడే నిలబడి, యిలాంటి సమయంలో, యిలాంటి వాతావరణంలోనే తను...

'పిల్లాడ్ని పుట్టనివ్వను' అనే అర్థం ధ్వనించే టట్లు చెప్పాడు. పుట్టనూ పుట్టాడు. కాస్త పెరగ నూ పెరిగాడు, నశించనూ నశించాడు.

'కాదు నశించలేదు' ఓ కంఠం కర్కశంగా అరచినట్లయింది.

అతను ఉలికిపడ్డాడు. అవును వాడి శరీరం నశించలేదు. తన వృత్తికోసం కళ్లముందు వుంచుకున్నాడు. కాని యీ వృత్తికి నిర్వచనం లేదు. ఇది సరసత వున్న మనిషి యొక్క వృత్తి కాదు.

నేను నశించలేదు నాన్నా. నేను నశించలే దు నన్ను బంధించారు. లోషన్‌లో ముంచారు. అద్దాలగుండా అంతా చూస్తున్నారు. నా పెద్ద తలకాయ వాళ్ల చూపులతో చిల్లులు పడుతోం ది.

వారంరోజులు...! అబ్బ! ఇంతకాలం గడిచి పోయింది. ఈ జీవితం తన శరీరాన్ని బంధించి వేసింది. ఇన్నాళ్లు... తను... ఎలా భరించాడు? ఎలా జీవించాడు?

ఆశ్చర్యం కాదు... అతని కంటి నుండి రక్తపు చుక్కల వంటి నీటి బిందువులు రాలాయి. నువ్వు రాయివి. బండరాయివి.

మనసు పొమ్మని శాసిస్తోంది.

శక్తిలేదు, శక్తిలేదు.

చావవులే. రాళ్లకి చావులేదుగా.

రాళ్లకి చావులేదుగా.

కాళ్లు, మనసూ ఏకమైనాయి. మస్తిష్కం పనిచేయడం మానివేసింది. అంత చలిలోనూ చమరుస్తున్నాడు. "పోతాను, పోతాను".

బంగళా పోర్టికోలోంచి ఎంబాసిడర్ కారు కదిలింది.

మ్యూజియంలోకి అడుగుపెట్టి, గోడకున్న స్విచ్ నొక్కాడు. హాలు హాలంతా విద్యుత్ వెలు గుతో నిండిపోయింది.

అదిగో... తన... అదిగో... రెండడుగులు వేశాడు.

హఠాత్తుగా లైట్లు ఆరిపోయాయి. కరంటు పోయినట్లుంది. అంతా చీకటి. గాఢాంధకా రం... ఏమీ కనబడట్లేదు.

బాబూ! ఎక్కడా?! హృదయం మూలిగింది.

ఇదిగో నాన్నా యిక్కడ, యిక్కడ నన్ను బం ధించారు. ఊపిరాట్టంలేదు.

ఒక్క నిమిషం. వస్తున్నాబాబూ. సెంటిమెం ట్లకి అతీతుడు ప్రొఫెసర్ శ్రీధర్ అడుగులు వేస్తు న్నాడు. తడుముకుంటూ... తడబడుతూ.

చీకటిలో అతని చుట్టూ అనేక రోగాల తాలూకు విచిత్ర భయంకర చిహ్నాలు... స్త్రీలవి, పసిపాపలవి, వృద్ధులవీ, గుండె జబ్బులవి, కాన్సర్‌వి, క్షయవ్యాధివి, సెఫిలిస్‌వి, ప్రైమరీస్, సెకండరీస్ వందలు వందలు... అతని సేకరణ

మానసిక ఆస్తి.

నాన్నా! నాన్నా! ఇక్కడ నానా!

అతన్ని అన్ని వైపుల నుంచి పిలుస్తున్నట్లుగా ఉంది.

అన్ని దిక్కుల నుంచి వినిపిస్తోంది. దారి తెలియటంలేదు. ప్రక్కకి పోతున్నాడు. ముందుకు పోతున్నాడు.

టక్... టక్... టక్ అడుగుల చప్పుడు.

ఎవరిది? ఆగి అరిచాడు. తన అడుగుల సవ్వడే యింత భయాన్ని కలిగించిందా? అంతా నిశ్శబ్దం. మళ్లా కదిలాడు.

నానా! నాన్నా!

పిలుపు జాలిగా, దీనంగా రక్తాన్ని పిండుతూ...

ఎవరిదో నవ్వు

"ఎవరది?" మళ్లీ అరిచాడు.

"ఇక్కడ నాన్నా! ఇక్కడ నాన్నా!!"

చేరుకున్నాడు. చేతులని ముందుకు చాచి అక్కడున్న గ్లాస్ జార్‌ని తడిమాడు. అవుననే నమ్మకం కుదిరింది.

"నువ్వేనా నాన్నా!"

"అవును! నాన్నా!"

అనుకోకుండా అతని చేతులు దాన్ని పైకెత్తాయి. చాలా బరువుగా వుంది. దాన్ని దగ్గరకు తీసుకోవాలని, కావలించుకోవాలనీ ఆరాటం... చేతులు వణుకుతున్నాయి.

అంతకంతకూ బరువు ఎక్కువవుతోంది. చేతులకు శక్తి చాలడంలేదు.

గుండెకు అదుముకుంటున్నాడు. చేతుల పని అయిపోయింది. అవి దాసోహమన్నాయి. దగీర్ "బాబూ!" అన్న అరుపులు వెర్రిగా.

దీపాలు వెలిగాయి. నిలబడి వణికిపోతున్న శ్రీధర్‌కి కనిపించింది ముక్కలూ, చెక్కలుగా... క్రిందపడివున్న గాజు పాత్రా, నలువైపులా కారిపోయిన ఫార్మరిక్, అందులో అప్పుడే చనిపోయినట్లు నిశ్చింతగా పడివున్న విచిత్రపు మాంసపు ముద్ద.

శ్రీధర్ వొంగి కొడుకుని చేతుల్లోకి తీసుకున్నాడు. ఆ శరీరం వంక ఒక నిముషం తదేకంగా చూశాడు. నీకు న్యాయం చేస్తాను. ఆరాటం మనసు ఉరకలు వేసింది. అలా పిల్లవాణ్ని ఎత్తి భుజాలమీద వేసుకుని బయటికి నడిచాడు. మ్యూజియంలోని ఒక స్పెసిమన్‌ని ఉన్మాదిలా కారులో పెట్టుకుంటున్న ప్రొఫెసర్‌ని విచిత్రంగా చూస్తూ నిలబడ్డారు అటెండరూ, వాచ్‌మన్‌లూ. కారు కదిలి స్మశానం వైపు దారితీసింది.

* * *

కసిదీరా, కరువుతీరా అంతా చెప్పేసి, భార్య వడిలో తలదూర్చి ఏడ్చేస్తున్నాడు శ్రీధర్. ఎంత హాయిగా వుంది ఏడుపు? ఎంత సుఖం? శ్రీదేవి అతని జుట్టులోకి వేళ్లు పోనిచ్చి రాస్తూ, మూగగా అశ్రుధారలు విడుస్తోంది.

రవ్వంత కూడా దాచకుండా అంతా చెప్పేశాడతను. శ్రీదేవీ! నేను మంచి నాన్నని కావాలని వుంది. నేను మంచి నాన్నని కావాలి!

ఈనాడు పరిస్థితి యిలా పరిణమించకపోతే తను చెప్పబోయే విషయాన్ని యిలా చెప్పేది... 'నాకు ఎబార్షన్ చేయించండి.'

కాని యిప్పుడు... యిది వేరు. ఇవి కొత్త చిగుళ్లు. మీ కోరిక... మరో ఏడు నెలల్లో... అతని చెవి దగ్గర మధుర మంజులమైన షెహనాయి వినిపించింది. ●